క్లుప్తంగా

15 నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు

మధిర: సీఎం కప్‌లో భాగంగా ఈనెల 15నుంచి జరగనున్న మండల స్థాయి క్రీడాపోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ లలిత కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సిలార్ సాహెబ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మధిర టీవీఎం పాఠశాల ఆవరణలో 15 నుంచి 36 ఏళ్ల వయసు స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్ బాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ ప్రభాకర్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

తల్లాడ/కొణిజర్ల/ఏన్కూరు/ముదిగొండ: సీఎం కప్ పోటీలకు విజయవంతం చేయాలని తల్లాడ, ముదిగొండ ఎంపీపీలు దొడ్డా శ్రీనివాసరావు, సామినేని హరిప్రసాద్, తల్లాడ, కొణిజర్ల, ఏన్కూరు, ముదిగొండ ఎంపీడీఓలు రవీంద్రరెడ్డి రమాదేవి, బి.అశోక్, శ్రీనివాసరావు కోరారు. తల్లాడ, కొణిజర్ల, ఏన్కూరుల్లో గురువారం వారు మాట్లాడుతూ ఈనెల 15 నుంచి అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయికి పంపించనున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఆసక్తి ఉన్న వారు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, తల్లాడలో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు డి.వెంకట్ లాల్, ఎంఈఓ దామోదరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి సెక్షన్ పరిధిలోని గౌరిగూడెం 33/11 కేవీ ఫీడర్ మరమ్మతులు, ట్రీ కటింగ్స్ నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్, సర్వరాయ షుగర్స్, గౌరిగూడెం, కె.రేజర్ల ఫీడర్స్, సదాశివునిపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని తుంబూరు, నారాయణపురం, సదాశివునిపాలెం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాబా ఆలయాల్లో పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో గురువారం అర్చకులు సాంప్రాదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, సుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీల వితరణ



కుర్చీలు అందజేస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని పాలడుగులో గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రానికి గురువారం సన్‌రైజ్ సంస్థ సభ్యుడు ఏనుగు కిశోర్ బాబు జన్మదిన వేడుకల సందర్భంగా బేబీ చైర్స్, ఉపాధ్యాయులకు కుర్చీలు, వాటర్ క్యాన్‌ను వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాలతి దాస్, షేక్. మహబూబ్ సుభానీ, ఏనుగు సుమన్, అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

మధిర: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ కర్నాటి భారతి కోరారు. గురువారం మున్సిపాలిటీలోని 3 వార్డులో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వృద్ధులు కంటి చూపు లేక ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికోసం ప్రత్యేకంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య, వేణుగోపాల్, ఏఎన్ఎంలు రాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్

ఈ రోడ్డుకు మోక్షం ఎన్నడో?

ఐదేళ్లుగా పూర్తికాని బీటీ రోడ్డు పనులు

- అసంపూర్తి రోడ్డుపై తరచూ ప్రమాదాలు
- ప్రజలు ఆందోళనలు చేసినా కానరాని ఫలితం



కంకర తేలిన మెకాలకుంట - జంపాలనగర్ రోడ్డు



అసంపూర్తిగా డ్రెయినేజీ నిర్మాణం



రహదారిపై రాస్తారోకో చేస్తున్న గిరిజనులు(ఫైల్)

కొణిజర్ల: గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు చేస్తున్నామని పాలకులు చెప్పడంతో పొంగిపోయారు. అన్నట్టుగానే రోడ్డు మంజూరై పనులు మొదలయ్యాయి. ఇంకేముంది త్వరలోనే రోడ్డు అందుబాటులోకి వచ్చినట్లేనని ప్రజలు సంతోషించారు. కానీ కాంట్రాక్టర్ పనులు నిలిపేసి అడ్రస్ లేకుండా పోయి నాలుగేళ్లు దాటినా అటు అధికారులు, ఇటు ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇదీ కొణిజర్ల మండలంలోని మెకాలకుంట నుంచి జంపాల నగర్ వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు తీరు.

2018లో శంకుస్థాపన..

కొణిజర్ల మండలం మెకాలకుంట నుంచి జంపాల నగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ఐటీడీఏ నిధులు రూ 3.20 కోట్లు మంజూరు కాగా, అప్పటి ఖమ్మం ఎంపీ పొంగులేటి శ్రీనివారెడ్డి, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ 2018 డిసెంబర్ 24న శంకుస్థాపన చేశారు. మెకాలకుంటలో సీసీ రోడ్డు, డ్రెయినేజీలు, అక్కడి నుంచి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉండగా సదరు కాంట్రాక్టర్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, కొద్దిమేర డ్రెయిన్ పనులు చేపట్టాడు. అలాగే, మెకాలకుంట నుంచి జంపాలనగర్ వరకు గ్రావెల్ వేశాక... జంపాలనగర్ అటవీ ప్రాంతమని చెబుతూ రోడ్డు నిర్మాణానికి అటవీ అధికారులు అడ్డుకున్నారు. దాదాపు రెండేళ్ల పాటు పనులు నిలిచిపోగా, అధికారులు, ప్రజాప్రతినిధులు అటవీ అధికారులతో సంప్రదించి ఎట్టకేలకు అనుమతి తీసుకున్నారు. అనంతరం ఏడాది క్రితం సదరు కాంట్రాక్టర్ తిరిగి పనులు మొదలుపెట్టి మొదటి లేయర్‌గా చిప్స్ వేసి వదిలేశాడు. బిల్లు రావడం లేదని, నిర్మాణ వ్యయం పెరిగిందని చెబుతూ చేతులెత్తేయడంతో ఏడాది కాలంగా కంకర తేలిన రోడ్డు పైనే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో తరచుగా ప్రమాదాలు జరుగుతుండగా.. సైడ్ డ్రెయిన్ల నిర్మాణం పూర్తికాక... వర్షాకాలంలో ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఈ విషయమై మార్చి నెల 9న జంపాల నగర్ నుంచి మెకాలకుంట పల్లిపాడు మెయిన్‌రోడ్డు వరకు గిరిజనులు పాదయాత్ర నిర్వహించి రాస్తారోకో చేశారు. దీంతో ఐటీడీఏ అధికారులు రోడ్డు నిర్మాణం చేయిస్తామని హామీ ఇవ్వడం, స్వయంగా కలెక్టర్ ఆదేశించడంతో కాంట్రాక్టర్ కొంత సామగ్రి తెప్పించినా ఆతర్వాత జాడ లేకుండా పోవడంతో పరిస్థితి మొదటికొచ్చింది.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



కంకర తేలిన రోడ్డుపై ఇబ్బందిగా ఉంది. కాంట్రాక్టర్‌కు ఇబ్బంది ఉంటే వేరే వాళ్లకు పని ఇవ్వాలి. కానీ ఇలా మధ్యలో పని వదిలేస్తే మేం అవస్థలు పడుతున్నారు. అయినప్పటికీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంతో మా ఇబ్బందులు తీరేదెన్నడో తెలియడంలేదు.

– తేజావత్ కృష్ణకాంత్, మెకాలకుంట

తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలి



కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ఏళ్లుగా రోడ్డు నిర్మాణం పూర్తికావడం లేదు. ఐటీడీఏ, కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్ ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు. ఇకనైనా కాంట్రాక్టర్‌ను మార్చి పనులు చేయించాలి.

– భూక్యా వీరభద్రం, గిరిజన సంఘం నాయకుడు

టెండర్ రద్దుకు ప్రతిపాదనలు

మెకాలకుంట నుంచి జంపాలనగర్ రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పనులు సరిగా చేయడం లేదు. దీంతో సదరు టెండర్‌ను రద్దు చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఇంకా నిర్ణయం వెలువడలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే రోడ్డు నిర్మాణం విషయంలో తదుపరి చర్యలు తీసుకుంటాం.

– విజయ్, ఏఈఈ, ఐటీడీఏ

జేపీఎస్‌ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మధిర: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మండల పరిషత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు రాధాకృష్ణ మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడకంటి మురళి, పల్లికంటి నెల్సన్, మండల కమిటీ సభ్యులు మద్దాల ప్రభాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీఓకు రవీంద్రరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించి చర్చలు జరిపి సమ్మెను విరమించేలా చేయాలని వినతి ప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్ రావు, మన్నేపల్లి రామారావు, షేక్ మస్తాన్, మన్నేపల్లి అర్జున్‌రావు, దూళ్ల జనార్ధన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని తెల్లపాలెం, అయ్యవారిగూడెం, మాముసూరు గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన రూ.70,500 సీఎం సహాయ నిధి చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి మండల కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో ఈ చెక్కులు మంజూరయ్యాయన్నారు. కాగా, హైదరాబాద్‌లో ఇటీవల కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ పాల్గొన్న యువ సంఘర్షణ సభ విజయవంతమైందని సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం ప్రతాపరెడ్డి, బండారు నర్సింహారావు, కడియం శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనిల్‌కుమార్, బాణావత్ శ్రీనివాసరావు, కృష్ణారావు, ఇస్మాయిల్, రాజేష్, వెంకటనర్సయ్య, బాబురావు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తోందా..?



కూలిపోయిన నీటి సంపు గోడ

- ఆస్పత్రి భవన నిర్మాణాలపై పలువురి అనుమానాలు

కల్లూరు: కల్లూరు ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనికి నిదర్శనంగా ప్రాంగణంలో నీటి నిల్వకోసం నిర్మించిన సంపు గోడ కూలి వ్యక్తి మరణించడంతో వారి ఆరోపణలకు బలం చేకూర్చినట్లైంది. కల్లూరు ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో నూతన భవన నిర్మాణాలకు రూ. 11 కోట్లు మంజూరు కాగా ఇటీవల భవన నిర్మాణ పనులు చేపట్టారు. రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీష్‌రావు భవన నిర్మాణాలకు ఇటీవలే శంకుస్థాపన చేశారు. నిర్మాణ సమయంలో నీటిని వాడుకోవడం కోసం నీటి నిల్వ కోసం సంపు నిర్మాణం పునాది లేకుండా భూమిపైనే గోడలు నిర్మించారు. దీంతో గురువారం సంపులో నీటిని నింపడంతో సంపు గోడ కూలి ప్రమాదం జరిగి వ్యక్తి మృతి చెందాడు. నాణ్యతా ప్రమాణాలు లేకపోతే భవనాలు కూడా కూలిపోతాయని స్థానికులు అనుకుంటున్నారు. సంపు గోడలే నాణ్యత లేకుండా నిర్మిస్తే ఇక ఆస్పత్రి భవన నిర్మాణం నాణ్యతపై ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆస్పత్రి భవన నిర్మాణం జరిగేటప్పుడు సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

స్టేట్ టాపర్‌కు సన్మానం



సిరిని సత్కరిస్తున్న మట్టా దంపతులు

సత్తుపల్లిటౌన్: ఇంటర్ హెచ్ఈసీ గ్రూప్‌లో 972 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని దాసరి సిరిని గురువారం డాక్టర్ మట్టా దయానంద్, డాక్టర్ రాగమయి దంపతులు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షులు అలవాల కరుణాకర్, కొచ్చెర్ల శ్రీనివాసరావు, ఎండి.కమల్‌పాషా, కిరణ్ పాల్గొన్నారు. అదేవిధంగా నవచైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు గాదె నర్సింహారెడ్డి, తోట కిరణ్‌లు దాసరి సిరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు చల్లారి కృష్ణయ్య, మాదిరాజు పుల్లారావు, గుడిపూడి సుధీర్, గాదె నాగు, పాలకొల్లు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, మైలమాల యేసయ్య పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో ప్రముఖులు

ముదిగొండ: మండల పరిధిలోని వెంకటాపురంలో గురువారం గోకినేపల్లికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకులు మీగడ శ్రీనివాస్‌యాదవ్ కుమారుడు రాణాప్రతాప్‌యాదవ్ వివాహానికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ దుర్గ, సొసైటీ చైర్మన్ యలగొండస్వామి, నాయకులు వెంకట్, వీరారెడ్డి, వెంకటనారాయణరెడ్డి, సంజీవరెడ్డి, ఎర్ర వెంకన్న పాల్గొన్నారు.

పెనుబల్లి/ కల్లూరు: కల్లూరు, పెనుబల్లి మండలాల్లో జరిగిన పలు వివాహ వేడుకలకు ఖమ్మం మాజీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు అందజేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, పెనుబల్లి జెడ్పీటీసీ చెక్కిలాల మోహనరావు, నాయకులు శ్రీనివాసరెడ్డి, పిల్లి నవజీవన్, రాజబోయిన కోటేశ్వరరావు, నరసింహారెడ్డి , మల్లెల రాజా, కాటేపల్లి కిరణ్‌కుమార్, యాసా వెంకటేశ్వరరావు, ధరావత్ మోహన్, శ్రీనివాసరావు, రంగు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గురువారం పర్యటించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ దొడ్డా శ్రీనువాసరావు, దుగ్గిదేవర వెంకట్ లాల్, దూపాటి భద్రరాజు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, జీవీఆర్, పెరికె నాగేశ్వర్‌రావు, గుండ్ల వెంకటేశ్వర్లు, వీరకృష్ణ, నాగయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే రాములునాయక్



మహిళకు కళ్లజోడు అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

కొణిజర్ల: గ్రామీణ ప్రాంత నిరుపేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపడుతున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. మండలంలోని పల్లిపాడు 16వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కంటి పరీక్ష చేయించుకున్న వారికి కళ్లజోళ్లు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, కౌన్సిలర్లు చల్లగుండ్ల నాగేశ్వరరావు, దామా వేణు, తడికమళ్ల నాగేశ్వరరావు, కమిషనర్ పఠాని వెంకటేశ్వర్లు, వైద్యాధికారి ఆర్.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రతిష్ఠ మహోత్సవం



ఎమ్మెల్యే సండ్రను సన్మానిస్తున్న నిర్వాహకులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని రుద్రాక్షపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ గురువారం వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, ఆషా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు డాక్టర్ మట్టా దయానంద్‌లు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సండ్ర వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ వనమా వాసు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ముత్తారెడ్డి, దాసరి శ్రీధర్‌రెడ్డి, దాసరి ప్రభాకర్‌రెడ్డి, దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దాసరి ప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి సంభాని వెం గోళ్ల అప్పారావు, కొర్రపాటి సాల్మన్ రాజు, కొండూరు కిరణ్, హాళావత్ వెంకటేశ్వర్లు, కాలం కృష్ణ, జొన్నలగడ్డ శ్రీను, ఒగ్గు భూపతిరెడ్డి, ధారావత్ కృష్ణ, ఎస్‌కె బాజీ, దేశిరెడ్డి సంజీవరెడ్డి, పాషా, పోతురాజు, నరేంద్ర పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఏసీపీ



క్షతగాత్రుడిని తన కారులో ఎక్కిస్తున్న ఏసీపీ

వైరా: ఓ వైపు భారీగా వర్షం.. వాహనాలు రాకపోకలకు అంతరాయం.. ఈ నేపథ్యాన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఏసీపీ ఎం.ఏ.రహమాన్ మానవత్వాన్ని చాటుకుని తన వాహనంలో బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కొణిజర్ల, చింతకాని మండలాల సమీపాన గురువారం జరిగింది. చింతకాని మండలం కొదుమూరు, వందనం మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కూలీలు స్తంభాలు వేస్తుండగా అకస్మాత్తుగా వచ్చిన భారీ ఈదురు గాలులకు కూలీ పనులు నిర్వహిస్తున్న బబ్లూ కాలిపై స్తంభం పడటంతో పూర్తిగా నుజ్జునుజ్జయింది. మంత్రి పర్యటన సందర్భంగా బందోబస్తుకు వెళ్లి వస్తున్న ఏసీపీ రహమాన్ ఈ విషయం తెలుసుకుని బాధితుడిని తన వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీతో పాటు పోలీసు సిబ్బందికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు, గ్రామస్తులు

కొణిజర్ల: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సర్పంచ్ సూరంపల్లి రామారావు నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు గురువారం కొణిజర్ల సెంటర్‌లో రాస్తారోకో చేసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సూరంపల్లి రామారావు మాట్లాడుతూ... అధికారులు, అధికార పార్టీ నాయకులు పక్షపాతంతో కొణిజర్లలో ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా ఇతర గ్రామాలలో ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొనకంచి స్వర్ణలత, రాయల భద్రయ్య, కొనకంచి శాంతకుమార్, స్వర్ణ రమేష్, బెజవాడ శ్రీను, దేవర వెంకన్న, జలక బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు పట్టవా?



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మధిర: అకాల వర్షాలు, కాంటాల్లో జాప్యం, మిల్లర్ల తీరుతో రైతులు ఇబ్బంది పడుతున్నా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. మధిర మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో జాప్యం చేస్తుండడంతో రైతులు విధిలేక క్వింటా రూ.1,500కే మిల్లుల్లో విక్రయిస్తున్నారని తెలిపారు. ఒకవేళ కొనుగోలు చేసినా కాంటా వేయడం, మిల్లులకు తరలింపులో నిర్వాహకులు జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు చిలువేరు సాంబశివరావు, రామిశెట్టి నాగేశ్వరరావు, పాపట్ల రమేష్, నంబూరు సోమేశ్వరరావు, బియ్యవరం రామకృష్ణ, కాసిన నాగభూషణం, రాము రైతులు తదితరులు పాల్గొన్నారు



అటెన్షన్ ప్లీజ్

గుంతలతో ప్రమాదమే..



ముదిగొండ మండలంలోని చిరుమర్రి, బాణాపురం, వల్లబి, మేడేపల్లి గ్రామాల ప్రధాన బీటీ రహదారులపై లోలెవల్ చప్టాలు గుంతలతో ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో ఈ చప్టాల వద్ద నీటి ప్రవాహంతో గుంతలు ఏర్పడడంతో వాటిని తిరిగి మరమ్మతులు చేయించే నాథుడే లేకపోయే సరికి పలు వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇక రాత్రి సమయాల్లో కనపడని గుంతల వద్ద కింద పడి క్షతగ్రాత్రులు అవుతున్నారు. కనీస మరమ్మతులు ఐనా చేయించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. - ముదిగొండ

ప్రశ్నించాల్సిన అధికారి : - రాజేష్, ఆర్అండ్‌బీ ఏఈ, మధిర
సెల్ నంబర్ : 9441055478